సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



కొనుగోళ్లు సాగేనా?

ఇల్లెందు మార్కెట్‌లో క్రయవిక్రయాలను పట్టించుకునే వారే లేరు. ఈసారైనా కొనుగోళ్లు సాగేనా అని రైతులు ఎదురుచూస్తున్నారు. 8లో



ముందు జాగ్రత్తలు అవసరం

వాతావరణ మార్పుతో జ్వరాలు ప్రబలుతున్నాయని, అదుపునకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
33° / 24°

జిల్లాలో ఆదివారం పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రామాలయ ప్రసాదాలనూ తనిఖీ చేయండి

- ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఈఓ లేఖ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో తయారు చేసే ప్రసాదాలకు సంబంధించిన ఆహార వస్తువులను తనిఖీ చేయాలని ఈఓ రమాదేవి ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు శనివారం లేఖ రాశారు. తిరుమల తిరుపతి లడ్డూ వివాదం నేపథ్యంలో భద్రాద్రి రామయ్య ప్రసాదాలను భక్తులకు మరింత నాణ్యంగా అందించేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందని లేఖలో పేర్కొన్నారు. కాగా, ముక్కోటి, శ్రీరామనవమి ఉత్సవాల సమయంలోనే ఈ ఆహార వస్తువుల సామగ్రి, ప్రసాదాలను సాధారణంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేస్తుంటారు. అలా కాకుండా ప్రతి నెలా తనిఖీలు చేపట్టాలని ఈఓ కోరారు.

ప్రధాన అర్చకుడి ఇంటికి ఉత్తర్వులు..

ఇటీవల రామాలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ముఖ్య అర్చకుడు సీతారాంను ఓ కేసు విషయంలో సస్పెండ్ చేసిన విషయం విదితమే. అయితే వారిని కలిసి ఉత్తర్వులు అందజేసేందుకు సిబ్బంది ప్రయత్నించగా అందుబాటులో లేరని తెలిసింది. దీంతో ఆ ఉత్తర్వులను వారి ఇంటి తలుపులకు అతికించారు.

రేపు మంత్రి పొంగులేటి పర్యటన



మాట్లాడుతున్న చైర్మన్ డీవీ తదితరులు

ఇల్లెందు: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఇల్లెందులో పర్యటించనున్నారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు వివరాలు వెల్లడించారు. 23న ఉదయం 8:45 గంటలకు ముకుందాపురం – కట్టుగూడెం రోడ్డు నిర్మాణానికి, 9:15 గంటలకు మేడికుంట – రామచంద్రాపురం రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 10 గంటల నుంచి ఇల్లెందులో చెరువు కట్ట వద్ద గల లేక్ వ్యూ పార్క్ సుందరీకరణ, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి, బుగ్గవాగు పనులకు, మున్సిపల్ మోడల్ మార్కెట్ ప్రహరీ, రోడ్లు, కాలువల పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో చిల్డ్రన్స్ పార్క్ ప్రారంభిస్తారు. అనంతరం బొజ్జాయిగూడెంలోని ఎస్‌ఎస్ గార్డెన్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం ఉంటుంది. అక్కడే భోజన విరామం తర్వాత తిరిగి వెళ్తారు. కాగా, మంత్రి పర్యటనను విజయవంత చేయాలని డీవీతో పాటు కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు డానియేల్, పులి సైదులు కోరారు.

వరదలతో ప్రమాదాలు ఎదురైతే మేమున్నామంటూ ఆపద్బాంధవుల్లా ఆదుకుంటున్నారు డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(డీడీఆర్‌ఎఫ్) బృందం సభ్యులు. జిల్లాలో ఇటీవల పలుమార్లు వర్షాలు, వరదలు ముంచెత్తగా సమాచారం అందగానే అక్కడికి వెళ్లి ప్రజలను, మూగ జీవాలను రక్షించి శభాష్ అనిపించుకున్నారు. జిల్లాలో రెండేళ్లుగా సేవలు అందిస్తున్న ఈ బృందంలో సుశిక్షితులైన 20 మంది సభ్యులు ఉన్నారు. ఆపత్కాలంలో 24 గంటలూ విధులు నిర్వహించేందుకు కూడా వారు వెనుకాడడం లేదు.

– పాల్వంచరూరల్



కిన్నెరసాని వాగులో రెస్క్యూ చేస్తున్న డీడీఆర్‌ఎఫ్ సభ్యులు

సండే స్పెషల్

మేమున్నామంటూ..

ఆపద్బాంధవుల్లా డీడీఆర్‌ఎఫ్ సిబ్బంది

- వరదల సమయాల్లో వారి సేవలు అమూల్యం
- అందుబాటులో రెండుబోట్లు, డ్రోన్, ఆధునిక యంత్రాలు
- జిల్లాలో రెండేళ్లుగా 20 మంది విధులు
- ఇప్పటివరకు 246 మందికి ప్రాణ రక్షణ

సమాచారం అందితే చాలు..

భద్రాద్రితో పాటు ఖమ్మం జిల్లాలోనూ ఎక్కడ ఏ ఆపద వచ్చినా సమాచారం తెలియగానే చేరుకుని బాధితులను రక్షిస్తున్నారు. పాల్వంచ మండలం దంతలబోరు వద్ద కిన్నెరసాని వాగులో ఇటీవల ఏడుగురు పశువుల కాపర్లు చిక్కుకోగా.. రాత్రి వేళ వారికి విషయం తెలిసింది. వెంటనే 20 మంది సభ్యులు.. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులోకి రెండు బోట్లలో వెళ్లారు. సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులోనూ నాలుగు గంటల పాటు కష్టపడి ఆరుగురిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అయితే వీరు అక్కడికి వెళ్లకముందే జారే సాయి అనే యువకుడు ఈదుకుంటూ వెళ్లి వాగులో గల్లంతయ్యాడు. అతడి ఆచూకీ కోసం తెల్లవారి గ్రామస్తులు మరో ఐదుగురు వెళ్లి వాగులో చిక్కుకోగా.. వారిని కూడా డీడీఆర్‌ఎఫ్ సభ్యులు రక్షించి అందరి అభినందనలు అందుకున్నారు.

తొలిసారి కిన్నెరసానిలో వినియోగం..

డీడీఆర్‌ఎఫ్ బృందం వద్ద ఉన్న ఆధునిక డ్రోన్‌ను తొలిసారిగా ఇటీవల కిన్నెరసాని వాగులోనే వినియోగించారు. పాల్వంచ మండలం దంతలబోరు గ్రామం వద్ద గల వాగులో చిక్కుకున్న ఐదుగురు ఉదయం నుంచి తిండి, తాగునీరు లేక అలమటిస్తూ కేకలు వేసినా.. స్థానికులకు, వారి బంధువులకు వాగులోకి వెళ్లి భోజనం అందించే అవకాశం లేదు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న డీడీఆర్‌ఎఫ్ సభ్యులు సుమంత్ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా వాగులోకి వెళ్లి బాధితులకు ఆహారం, తాగునీటి బాటిళ్లు, లైఫ్ జాకెట్లు అందజేశారు.

ఆపదలో ఉన్నారని తెలిస్తే వెళ్లిపోతాం



వరదల్లో చిక్కుకున్నారని, ఆదపలో ఉన్నారని తెలిస్తే చాలు అక్కడికి చేరుకుని బాధితులను సురక్షితంగా బయటకు తీసుకొస్తాం. ఇలా జిల్లాలో 46 మందిని రక్షించగా, ఇటీవల ఖమ్మంలో మున్నేరుకు వచ్చిన వరదల్లో చిక్కుకుపోయిన 200 మందిని భవనాల పైనుంచి రెస్క్యూ చేసి సురక్షితంగా కాపాడాం. జూలై 18న అశ్వారావుపేట మండలంలోని పెదవాగుకు గండిపడినప్పుడు కూడా 11 మందిని రాత్రి వేళ రక్షించాం. ఈనెల 1న మణుగూరులో వరదలో చిక్కుకున్న 30 మందిని, 4వ తేదిన కిన్నెరసానివాగులో ఐదుగురిని.. మొత్తంగా 246 మందిని కాపాడగలిగాం. జలాశయాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మా సూచన.

– చింతమళ్ల సుమంత్, డీడీఆర్‌ఎఫ్ ఇన్‌చార్జ్ ఆర్‌ఎస్సై

అధునాతన యంత్రాలతో సేవలు..

డీడీఆర్‌ఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్న బృందానికి ఇన్‌చార్జ్ ఆర్‌ఎస్సై సుమంత్ చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయనతో పాటు మరో 19 మంది సిబ్బంది విశేష సేవలు అందిస్తున్నారు. ఈ బృందం వద్ద రెండు ఇన్‌ఫ్లేటబుల్ బోట్లు, లైఫ్ జాకెట్లు, తాళ్లు, డ్రోన్ అందుబాటులో ఉన్నాయి. 800 మీటర్ల దూరం వరకు 12 కేజీల బరువును మోసుకెళ్లే సామర్థ్యం గల డ్రోన్ సిద్ధంగా ఉంది.



కిన్నెరసాని వాగు వద్ద డ్రోన్‌తో సిబ్బంది, స్థానికులు

పారపట్టి.. చెత్త తొలగించి!

పరిసరాల పరిశుభ్రత పాటించాలన్న కలెక్టర్ పాటిల్

కొత్తగూడెంరూరల్ : పరిసరాల పరిశుభ్రతను ప్రతీ ఒక్కరు బాధ్యతగా భావించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ప్రజలు, అధికారులు, శానిటేషన్ సిబ్బంది సహకారంతో పరిశుభ్ర జిల్లాగా మార్చాలని పిలుపునిచ్చారు. నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే కలెక్టర్.. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం శ్రమదానం చేశారు. కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను పంచాయతీ సిబ్బంది, విద్యార్థులతో కలిసి పారపట్టి తొలిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో క్రీడలకు అవసరమైన స్థలం ఉన్నందున తన నిధులను కేటాయించి రన్నింగ్ ట్రాక్, హాకీ, వాలీబాల్ కోర్టులు, స్విమ్మింగ్ పూల్ తదితర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి, డీపీఓ చంద్రమౌళి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజ, డీఐఈఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ చలపతి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి పూర్ణచందర్‌రావు, కోచ్ ఇమామ్, సైదులు పాల్గొన్నారు.



కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తదితరులు

ఏజెన్సీలో హై అలర్ట్

- ప్రారంభమైన మావోయిస్టు పార్టీ ఆవిర్భావ ఉత్సవాలు
- విస్తృతంగా కూంబింగ్ చేస్తున్న పోలీసులు
- పలు ప్రాంతాలకు నిలిచిన ఆర్టీసీ బస్సులు

చర్ల/దుమ్ముగూడెం/కరకగూడెం : మావోయిస్టు పార్టీ ఆవిర్భావ ఉత్సవాలు ప్రారంభం కావడంతో ఏజెన్సీలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈనెల 21 నుంచి అక్టోబర్ 20 వరకు ఉత్సవాలు నిర్వహించాలని మావోయిస్టులు నిర్ణయించడంతో పోలీసులు అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ ముమ్మరం చేశారు. ఇటు పోలీసులు, అటు మావోయిస్టుల నడుమ తమ పరిస్థితి ఏంటని అటవీ ప్రాంత సమీప గ్రామాల వారు భయాందోళనలు చెందుతున్నారు. కొందరు గ్రామాలను వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్తుండగా, మరి కొందరు బయటకు వెళ్లేందుకే భయపడుతున్నారు. మరో వైపున మైదాన ప్రాంతాల్లోనూ పోలీసులు విస్తృతంగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అటవీ ప్రాంతాలకు వెళ్తున్న వారిపై నిఘా ఉంచారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సుల నిలిపివేత..

భద్రాచలం నుంచి చర్ల, వెంకటాపురం, కుంట ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులను సాయంత్రం 4 గంటల తర్వాత నడపడం లేదు. మరికొన్ని గ్రామాలకైతే పూర్తిగా నిలిపివేశారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా బస్సులు నిలిపివేయడం ఏంటని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కరకగూడెంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

విస్తృత తనిఖీలు..

చర్ల మండలంలోని ఆర్ కొత్తగూడెం, దేవరాపల్లి, కలివేరు, లెనిన్‌కాలనీ, తాలిపేరు ప్రాజెక్టు, దుమ్ముగూడెం మండలం సీతానగరం, పెదనల్లబల్లి, ములకపాడు క్రాస్‌రోడ్, వెంకటాపురం మండలం ఆలుబాక, సూరవీడుకాలనీ, పాలెం, ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలోని పైడిగూడెం, ఎలకనగూడెం, ధర్మాపేట, కిష్టారం, పాలోడి, గాజులగట్ట, దుబ్బమార్క, మారాయిగూడెం, లింగనపల్లి, గొల్లపల్లి తదితర ప్రాంతాల్లో పోలీసులు, బేస్‌క్యాంప్ సిబ్బంది జల్లెడ పడుతున్నారు. ఇక కరకగూడెం మండలంలోని పలు గ్రామాల్లో ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో శనివారం విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు.

‘మేనేజ్‌మెంట్ ట్రైయినీ’లో అన్యాయం

- తప్పుల తడకగా ప్రశ్నపత్రాల కీ
- హెడాఫీస్ ఎదుట అభ్యర్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మైనింగ్ అభ్యర్థులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో మేనేజ్‌మెంట్ ట్రైయినీ ఉద్యోగాల విషయంలో తమకు అన్యాయం చేస్తున్నారంటూ పలువురు అభ్యర్థులు శనివారం కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏడేళ్ల తర్వాత ఉద్యోగాల భర్తీకి సంస్థ గత మార్చిలో నోటిఫికేషన్ విడుదల చేసిందని, పరీక్ష నిర్వహణ, ప్రశ్నపత్రం తయారీ బాధ్యతలను ఎడ్‌సెల్ అనే సంస్థకు అప్పగించారని తెలిపారు. గత జూలై 21న పరీక్ష నిర్వహించగా ఈనెల 7న ప్రశ్నపత్రాల కీ విడుదల చేసిందని, అయితే ఇది తప్పుల తడకగా ఉందని ఆరోపించారు. తప్పొప్పులపై అభ్యర్థులు అభ్యంతరాలు తెలియజేయాలంటూ సూచించారని, దీంతో తాము ఈనెల 10న సీఎండీ బలరామ్‌ను కలిసి తప్పులను వివరించామని, సరి చేయాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వగా ఆయన సానుకూలంగా హామీ ఇచ్చారని, అయితే వాటిని సరిచేయకుండానే ఈనెల 17న ఫైనల్ లిస్ట్ విడుదల చేశారని, అందులోనూ పలు తప్పులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

139 పోస్టుల్లో 44కు పైగా మహిళలకేనా..

కోలిండియా ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్లు లేవని, కానీ దాని పరిధిలోని సింగరేణిలో మాత్రం వారికి 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం దారుణమని పురుష అభ్యర్థులు అంటున్నారు. మొత్తం 139 పోస్టులకు గాను 4,127 మందిమి పరీక్ష రాశామని, అందులో 159 మంది మహిళలు పరీక్ష రాయగా, 44 ఉద్యోగాలు వారికే పోతున్నాయని అన్నారు. మిగిలిన 95 పోస్టులకు 3,988 మంది అభ్యర్థులు పోటీ పడాల్సి వస్తోందని, అయితే ఇందులోనూ జనరల్ కేటగిరీ కింద కొన్ని మహిళలకు వచ్చే అవకాశం ఉందని, తద్వారా తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన చెందుతున్నారు. మహిళా రిజర్వేషన్ల కారణంగా తనకు 66వ ర్యాంక్ వచ్చినా ఉద్యోగం వచ్చే పరిస్థితి లేదని ఆలేటి సంతోష్ అనే అభ్యర్థి అన్నాడు. మహిళలకు కోలిండియాలో లేని రిజర్వేషన్లు సింగరేణిలో ఎందుకని మరో అభ్యర్థి వంశీ ప్రశ్నించాడు. కాగా, ఈ ఆందోళనకు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రా కామేష్ మద్దతు ప్రకటించారు.

టైలర్ కొడుకుకు కేంద్ర కొలువు

- నాలుగు సంవత్సరాల నిర్విరామ శ్రమకు దక్కిన ఫలితం



సాయికిరణ్

మణుగూరు టౌన్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని బాపనకుంటకు చెందిన నీరుడు నర్సింహారావు – వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు సాయికిరణ్‌ను చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీసీఎల్) కొలువు వరించింది. దేశ వ్యాప్తంగా 4 పోస్టులకు మూడు నెలల క్రితం పరీక్షలు జరగగా, 4వేల మంది నిరుద్యోగులు హాజరయ్యారు. రెండు నెలల క్రితం ఫలితాలు విడుదల కాగా, మెరిట్ ప్రకారం పది మందిని ఎంపిక చేశారు. ఇందులో సాయికిరణ్ ప్రథమ స్థానంలో నిలిచి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో భాగమైన సీపీసీఎల్‌లో జూనియర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించాడు. ఈ మేరకు ఆగస్టులో ఇంటర్వ్యూలు పూర్తి కాగా, శుక్రవారం ఉద్యోగ ఎంపిక పత్రం అందుకున్నారు. అయితే సాయికిరణ్ తండ్రి 2012లో అనారోగ్యంతో మరణించగా, తల్లి టైలర్ వృత్తి చేస్తూ కుమారుడిని చదివించింది. 2019లో కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో డిప్లొమా పూర్తి చేసిన సాయికిరణ్.. నాటి నుంచి మేనమామ ఏడుకొండలు సహకారంతో నిర్విరామంగా కేంద్ర కొలువు కోసం కృషి చేస్తున్నాడు. కాగా దేశ వ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలిచి మణుగూరు కీర్తిని చాటిన సాయికిరణ్‌ను పలువురు అభినందించారు.

మోతెగడ్డ ఆలయానికి ముప్పు?!

గోదావరి వరదతో కోతకు గురైన మట్టి

బూర్గంపాడు: గోదావరి మధ్యలో కాకతీయుల కాలాన నిర్మించిన పురాతన మోతె గడ్డ వీరభద్ర స్వామి ఆలయానికి ముప్పు పొంచి ఉందని తెలుస్తోంది. కాకతీయులు నిర్మించిన ఈ ఆలయానికి ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయానికి సూర్యభగవానుడు క్షేత్రపాలకుడుగా ఉన్నాడు. సంతానం లేనివారు గోదావరిలో స్నానం చేసి ప్రాణాసారం పడితే పిల్లలు జన్మిస్తారని భక్తుల నమ్మిక. మహాశివరాత్రి రోజు ఇక్కడ జరిగే స్వామివారి కల్యాణానికి తెలంగాణ, ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతారు. ఇంతటి విశిష్టతలు కలిగిన ఆలయం చుట్టూ భూమి ఇటీవల వచ్చిన గోదావరి వరదలతో కోతకు గురైంది. ఎప్పుడు లేని విధంగా మట్టి కోతకు గురవడంతో భవిష్యత్‌లో ఆలయానికి ముప్పు పొంచి ఉందని భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఈ పురాతన ఆలయ సంరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆలయం సమీపాన మట్టి కోతకు గురైన దృశ్యం

విద్యుత్ అధికారుల పొలంబాట


వివరాలు వెల్లడించిన ఎస్‌ఈ మహేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతుల సమస్యల పరిష్కారానికి పొలంబాట కార్యక్రమాన్ని చేపడుతున్నామని విద్యుత్ ఎస్‌ఈ జి. మహేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిగిన స్తంభాలు, వేలాడే తీగలను సరిచేస్తూ మధ్యలో స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని, మోటార్లకు పెట్టుకున్న ఆటోస్టార్టర్లను తొలగించాలని రైతులను కోరారు. ఆటో స్టార్టర్లతో మోటార్లు నిరంతరం నడిస్తే త్వరగా మరమ్మతులకు గురవుతాయని, నీరు కూడా వృథా అవుతుందని తెలిపారు. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని, వాటితో మోటార్ల జీవితకాలం పెరుగుతుందని, లో వోల్టేజీ సమస్య ఉండదని వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్‌కు వస్తే వెంటనే 1912 నంబర్‌కు ఫోన్ చేయాలని రైతులకు సూచించారు. ఈ సమాచారం వెబ్ అప్లికేషన్ ద్వారా సంబంధిత అధికారుల మొబైల్ యాప్‌నకు వెళ్తుందని, వారు ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి ఫెయిల్ అయిందని నిర్ధారిస్తూ యాప్‌లో నమోదు చేస్తే ఎస్‌పీఎం షెడ్ అధికారికి సమాచారం వెళ్తుందని తెలిపారు. దీంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, తమ సిబ్బందికి తెలియకుండా మరమ్మతులు చేపట్టవద్దని రైతులను కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంరూరల్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రోహిత్‌రాజ్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నెలవారీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కేసులో సమగ్ర విచారణ చేపట్టి దోషులకు శిక్ష పడేలా పోలీసులు పని చేయాలన్నారు. గణేష్ నవ రాత్రులు, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, అంకితభావంతో పని చేసిన సిబ్బందిని అభినందించారు. భవిష్యత్‌లో ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొంటారనే నమ్మకం కల్పించారని ప్రశంసించారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. మత్తు పదార్థాలు రవాణా చేసే వారితో పాటు సేవించే వారిపైనా కేసులు నమోదు చేయాలన్నారు. చోరీ కేసుల్లో సొత్తు రికవరీ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం, పొగ తాగేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అత్యుత్తమ సేవలందించిన పోలీసులకు ప్రశంస పత్రాలు అందజేశారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ సంక్వార్, కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, చంద్రభాను, సతీష్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

నాగన్నకు ‘సుద్దాల’ పురస్కారం



నాగన్న దంపతులను సన్మానిస్తున్న అశోక్‌తేజ

ఖమ్మంగాంధీచౌక్: ప్రజాకవి, గాయకుడు ఖమ్మం జిల్లాకు చెందిన అరుణోదయ నాగన్న సుద్దాల హనుమంతు, జానకమ్మ స్మారక జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈసందర్భంగా శని వారం ఖమ్మం వచ్చిన సినీకవి, సుద్దాల ఫౌండేషన్ చైర్మన్ సుద్దాల అశోక్‌తేజ అరుణోదయ నాగన్నను కలిసి పురస్కారం వివరాలు వెల్లడించారు. యాభై ఏళ్లుగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తరఫున కలం, గళం ద్వారా ప్రజాచైతన్యానికి కృషి చేస్తుండడంపై పురస్కారానికి ఎంపిక చేసినట్లు వివరించారు. వచ్చేనెల 19న హైదరాబాద్‌లో పురస్కార ప్రదానోత్సవం ఉంటుంద ని తెలిపారు.

క్లుప్తంగా

కబ్జా చేసిన స్థలాలు ఖాళీ చేయాలి..



కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

భద్రాచలంఅర్బన్: కబ్జా చేసిన స్థలాలను వెంటనే ఖాళీ చేయాలని డీఎల్‌పీఓ సుధీర్ సూచించారు. శనివారం ఆయన పట్టణంలోని ఫారెస్ట్ ఆఫీస్ వద్ద ఆక్రమణకు గురైన స్థలాలను గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించి, దుకాణాల నిర్వాహకులతో మాట్లాడారు. పంచాయతీ స్థలంలో అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో తాము తొలగించే ప్రక్రియ మొదలుపెడితే ఇబ్బంది పడతారని తెలిపారు.

సర్దుబాటు ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి

టేకులపల్లి: ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి అసంబద్ధంగా ఉన్న ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ (టీజీఏటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం జారీచేసిన మార్గదర్శకాలను పరిశీలిస్తే ప్రాథమిక పాఠశాలలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి స్పష్టమవుతోందని తెలిపారు. కాలం చెల్లిన 2015 నాటి రేషనలైజేషన్ నిబంధనల అమలు, పది మంది విద్యార్థులకు ఒకరు, అరవై మందికి ఇద్దరు ఉపాధ్యాయుల నిబంధనతో ప్రాథమిక పాఠశాలలు ఎలా బలోపేతం అవుతాయో అధికారులే తెలియజేయాలని సూచించారు. అలాకాకుండా 50లోపు విద్యార్థులు ఉన్న స్కూళ్లకు ముగ్గురు, 50 నుంచి 100 వరకు ఉంటే ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయిస్తూ ప్రతీ పాఠశాలకు ఒక హెచ్‌ఎం పోస్టును మంజూరు చేయాలని శ్రీనివాసరావు ఆ ప్రకటనలో కోరారు.

ఫుడ్ ఫారెస్ట్ సేద్యంతో అధిక లాభాలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శివ

చండ్రుగొండ: ఫుడ్ ఫారెస్టు సేద్యంతో రైతులు అధిక లాభాలు గడించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శివ, శ్రీనివాస్, మేనేజర్ నాగేంద్ర అన్నారు. మండలంలోని సీతాయిగూడెంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో శనివారం ఎంఎస్‌కే యూత్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రైతుల వ్యవసాయక్షేత్రంలో ప్రయోగాత్మకంగా ఫుడ్ ఫారెస్టు కార్యక్రమాన్ని చేపట్టామని, ఈ పథకం ద్వారా పండ్లు, ఔషధాల మొక్కల పెంపకమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పండ్ల మొక్కల పెంపకంతో రైతులు అధిక లాభాలు గడించవచ్చన్నారు. కార్యక్రమంలో నాగరాజు, లాలయ్య, నరేశ్, సత్యనారాయణతోపాటు రైతులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ



కుటుంబ సర్వే వివరాలు పరిశీలిస్తున్న డీఏఓ

కామేపల్లి: అర్హత కలిగిన రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల లోపు రుణం మాఫీ చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య తెలిపారు. మండలంలోని జాస్తిపల్లి పరిధిలో పత్తి, వరి పంటలను శనివారం పరిశీలించిన ఆయన సస్యరక్షణ చర్యలపై సూచనలు చేశారు. ఆతర్వాత పాన్నేకల్ రైతు వేదికలో రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, ఏఓ తారాదేవి, ఏఈఓలు ఉష, వేదిత, రవికుమార్ పాల్గొన్నారు.

కృష్ణకుమారికి డాక్టరేట్



కృష్ణకుమారి

సత్తుపల్లి: సత్తుపల్లి గాంధీనగర్‌కు చెందిన తన్నీరు కృష్ణకుమారి డాక్టరేట్ అందుకున్నారు. ఎన్‌ఐఎస్ శాస్త్రవేత్త డాక్టర్ సిల్వియా ఫెర్నాండెజ్ పర్యవేక్షణలో ఆమె 'ఇంపాక్ట్ ఆఫ్ పర్సనాలిటీ ఆన్ అకడమిక్ స్ట్రెస్ అండ్ సెల్ఫ్ ఎఫీకసి ఎమాంగ్ కాలేజ్ స్టూడెంట్స్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక పత్రానికి గాను ఉస్మానియా యూనివర్సిటీ సైకాలజీ విభాగం నుంచి డాక్టరేట్ ప్రకటించారు. కాగా, కృష్ణకుమారికి 2014లో కేయూలో ఎమ్మెస్సీ సైకాలజీ పూర్తిచేయగా బంగారు పతకం సాధించారు. డాక్టరేట్ సాధించేలా ప్రోత్సహించిన తల్లిదండ్రులు తన్నీరు వెంకటయ్య, వీరమ్మలకు, భర్త డాక్టర్ నర్సింహారావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,392

కొనుగోళ్లు సాగేనా?

- మార్కెట్లలో కొనుగోళ్లపై దృష్టి పెట్టాంటున్న రైతులు
- ఇల్లెందులో ట్రేడర్లతో సమావేశానికి సన్నాహాలు
- వచ్చే నెల మొదలుకానున్న పంటల సీజన్
- నాలుగు చెక్ పోస్టులు ఉండగా మరో మూడు పెంచేందుకు ఏర్పాట్లు



ఇల్లెందు మార్కెట్ కమిటీ కార్యాలయం

ఇల్లెందు: ఇల్లెందు మార్కెట్ కమిటీ లేక క్రయవిక్రయాల ఊసే లేకుండా పోతోంది. ఈ దఫా అయినా క్రయవిక్రయాలు సాగుతాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వ్యవసాయ మార్కెట్‌లన్నీ చెక్ పోస్టుల మీద ఆధారపడి ఆదాయం సాధించేందుకు కుస్తీ పడుతున్నాయి. ఏడాది పొడవునా ఏ ఒక్క మార్కెట్‌లో క్రయవిక్రయాలు సాగవు. మార్కెట్‌లకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం సాంధించాలంటే కేవలం చెక్ పోస్టులే కీలకంగా మారాయి. గత సీజన్‌లో ఏ ఒక్క మార్కెట్‌లోనూ పంట కొనుగోళ్లు సాగలేదు. మార్కెట్ కమిటీ పాలక వర్గాలు, అధికారులు హడావుడిగా ఎన్ని సభలు, సమావేశాలు పెట్టినా.. వ్యాపారులను బెదిరించినా షరా మామూలే అవుతోంది. జిల్లాలో కొత్తగూడెం, దమ్మపేట, బూర్గంపాడు, భద్రాచలం, చర్ల, ఇల్లెందులలో మార్కెట్ యార్డులున్నాయి. వీటిని సీజనల్ మార్కెట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. కేవలం ఆయా పంటల సీజన్‌లో అక్కడి అధికారులు కొనుగోళ్లు చేపట్టడం, ఆ తర్వాత చెక్‌పోస్టుల మీద ఆధారపడి గార్డులను పెట్టి కాపలా కాసి వాహనాలనుంచి పన్నులు వసూలు చేయటం పరిపాటిగా మారిపోయింది. దీంతో మార్కెట్ యార్డులన్నీ వెలవెలబోతున్నాయి. కొన్ని మార్కెట్లలో పశువులు, పందులు, కోతులు సంచరిస్తున్నాయి. గోదాములను పౌరసరఫరాలశాఖకు కిరాయికి ఇస్తున్నారు.

వచ్చేనెల నుంచి సీజన్..

ఏటా అక్టోబర్ నుంచి వ్యవసాయ సీజన్ కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. సీజన్ ఆరంభంలో రైతుల వద్ద నిల్వ ఉన్న వరి ధాన్యం, మొక్కజొన్న విక్రయించే అవకాశాలు ఉంటాయి. ఇక దసరా నుంచి పత్తి కూడా మార్కెట్‌కు వస్తుంది. ఇల్లెందు మార్కెట్ కమిటీ పరిధిలో ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి, కారేపల్లి, బయ్యారం, గార్ల, కామేపల్లి మండలాలున్నాయి. ఇల్లెందు, బొమ్మనపల్లి, బయ్యారం, గార్ల, ముచ్చర్ల క్రాస్‌రోడ్‌లో చెక్ పోస్టులు ఉన్నాయి. కాగా, ప్రస్తుతం ఉన్న నాలుగు చెక్ పోస్టులకు అదనంగా మరో మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇటీవల మార్కెట్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయన ఆదేశాల ప్రకారం ఇల్లెందు – పాకాల కొత్తగూడెం రోడ్‌లో ఒక చెక్ పోస్టు, గుండాల – పస్రా సరిహద్దులో దేవళ్లగూడెం వద్ద ఒక చెక్‌పోస్టు, ఆళ్లపల్లి – కొత్తగూడెం మధ్య చింతోనిచెల్క వద్ద ఒక చెక్ పోస్టు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.4.30 కోట్ల ఆదాయమే లక్ష్యం..



ఇల్లెందు మార్కెట్ లక్ష్యం రూ.4.30 కోట్లు కాగా ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రూ.1.80 కోట్లు సాధించాం. ఇక 2.50 కోట్లు సాధించాలి. అక్టోబర్ నుంచి మార్చి వరకు ఆరు నెలల కాలంలో లక్ష్యం సాధించాల్సి ఉంది. త్వరలోనే ఇల్లెందు మార్కెట్ కమిటీ పరిధిలో ట్రేడర్లతో సమావేశం నిర్వహిస్తాం. ఈ దఫా మార్కెట్‌లో క్రయ విక్రయాలు సాగేలా వ్యాపారులను సమాయత్తం చేస్తాం రైతులు నేరుగా మార్కెట్‌లో అమ్మకాలు, కొనుగోలు కోసం రావాలి.

– నరేశ్, గ్రేడ్–3 మార్కెట్ కార్యదర్శి

మార్కెట్‌లో కొనుగోళ్లు చేపట్టాలి..



వ్యాపారులు పల్లెల్లో తక్కువ ధరకు రైతులు పండించిన పంటలను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా పంటలను కొనుగోలు చేయాలి. అప్పుడే రైతుకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభిస్తుంది. ఈ దఫానైనా మార్కెట్‌లో క్రయవిక్రయాలు సాగేలా చూడాలి. పాలకులు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి

– నాయిని రాజు, మాస్‌లైన్ నాయకుడు

దోపిడీ తగ్గే అవకాశం ఉంది..



పంట ఉత్పత్తులను మార్కెట్‌లో కొనుగోలు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. అదనపు దోపిడీని అరికట్టినట్లు అవుతుంది. కాంటాల్లోనూ, ధరల్లో తేడాలు ఉండవు. రైతుల వద్ద వ్యాపారులు కొనుగోలు చేస్తే తరుగు పేరుతో తాలు పేరుతో దోపిడీ చేసే అవకాశం ఉంది. అంతేగాక మార్కెట్‌కు రావటం వల్ల ఎండకు, వానకు నష్టపోకుండా దాచుకునే అవకాశం ఉంది.

– హరిప్రసాద్ యాదవ్, టీఆర్ఎస్ నాయకుడు ఇల్లెందు

ప్రకృతి వ్యవసాయానికి తోడ్పాటు



మల్లాయిగూడెంలో వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

అశ్వారావుపేట: రసాయన ఎరువులు లేకుండా ప్రకృతి ఆధారిత వ్యవసాయం చేస్తున్న వారికి తోడ్పాటునిస్తామని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. అశ్వారావుపేట మండలంలోని మల్లాయిగూడెం, పండువారిగూడెం, దిబ్బగూడెం, రామన్నగూడెం తదితర గ్రామాల్లో నాబార్డు ఆధ్వర్యాన సాగవుతున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, ఎదురవుతుతున్న ఆటుపోట్లను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో 14 రకాల జీవరసాయన విధానాలను అవలంబిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని నాబార్డు ప్రతినిధులు వివరించారు. ఈ మేరకు జీవవనరులు కేంద్రం అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ.. రసాయన రహిత ప్రకృతి వ్యవసాయ అభివృద్ధి కోసం అన్ని విధాలా సహకరిస్తామన్నారు. ఈ క్రమంలో రైతులకు నాబార్డు సంస్థ అండగా నిలవాలని సూచించారు. నాబార్డు ఎండీ సంపత్‌కుమార్, ఏఓ శివకృష్ణ, ఏఈఓ షాకీరాభాను, సాయి, కార్యదర్శులు శ్రీకాంత్, సతీశ్, కాంగ్రెస్ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు, తుమ్మ రాంబాబు, జూపల్లి ప్రమోద్, కొర్రి మల్లయ్య, దారా ప్రసాద్, పి.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

సేవా పక్వాడా ద్వారా సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న తాండ్ర వినోద్‌రావు

చుంచుపల్లి: నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా పక్వాడాను ప్రారంభించామని, దేశంలో అన్ని ప్రాంతాల్లో కార్యకర్తలు పెద్దఎత్తున రక్తదానాలతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్‌రావు అన్నారు. శనివారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 25న పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ పుట్టినరోజు సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపడుతున్నమని ప్రతి మండలం, గ్రామంలోకి వెళ్లి విస్తృతంగా సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపడతున్నామని తెలిపారు. ఈ మధ్య కురిసిన అకాల వర్షాలకు రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని, యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో ఉన్న ఎన్జీఓలు పూర్తి సహకారం అందించాయని వెల్లడించారు. కొత్తగూడెం పట్టణంలో అమృత్ పథకం కింద వచ్చిన నిధులతో ఎలాంటి అభివృద్ధి చేయకపోగా.. ఆ నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో చాలామంది మైక్రోఫైనాన్స్ వల్ల ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధిలో చాలా వెనుకబడిందని, ఇక్కడి నాయకులు దందాలు, చందాలు వసూళ్లు చేయడంలో చాలా బిజీగా ఉన్నారని విమర్శించారు. సమావేశంలో నరేంద్రబాబు, బుడగం రవి, క్రాంతి పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని ఓ బస్తీలో ముగ్గురు బాలికలపై బాలుడు లైంగికదాడికి పాల్పడిన ఘటనలో పోక్సో కేసు నమోదైంది. శనివారం సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్ అండ్ ఆర్ కాలనీ సమీపంలోని లేబర్‌కాలనీలో ముగ్గురు బాలికలపై ఓ బాలుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో, రేప్ కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. కాగా, సమాచారం అందిన వెంటనే సీడీపీఓ అరుణకుమారి, సూపర్‌వైజర్ రోహిణి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శేషయ్య, సోషల్ వర్కర్ భారతి, బాబు, రాజు, సారమ్మ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లాభాల వాటా ప్రకటనపై పాలాభిషేకం



సీఎం, డిప్యూటీ సీఎం, సీఎండీ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో రెగ్యులర్ కార్మికులకు లాభాల్లో వాటా ప్రకటించడమే కాక తొలిసారి కాంట్రాక్టు కార్మికులకు సైతం రూ.5 వేల చొప్పున ఇవ్వనున్నట్లు ప్రకటించారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ చిత్రపటాలకు కొత్తగూడెంలో శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి తొలిసారి వాటా ప్రకటించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పలువురు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు అవసరం

డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్



పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

ఇల్లెందురూరల్/టేకులపల్లి: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో జ్వరాలు ప్రబలుతున్నాయని, అదుపు చేసేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ సూచించారు. శనివారం ఆయన ఇల్లెందు మండలం రొంపేడు, కొమరారం, టేకులపల్లి మండలం సులానగర్ పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యోగులంతా ఆశా కార్యకర్తలతో కలిసి గృహ సందర్శన చేయాలని, ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని అన్నారు. జ్వరాలు తీవ్రంగా ఉన్న గ్రామాల్లో వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చే వరకు స్థానిక సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగుపడేలా పంచాయతీ అధికారులను అప్రమత్తం చేయాలని, నీరు నిల్వ ఉండే చోట ఆయిల్‌బాల్స్ వేయాలని సూచించారు. ఆయా పీహెచ్‌సీలలో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఇమ్యునైజేషన్ అధికారి బాలాజీనాయక్, వైద్యాధికారులు కవిత, లోహిత, కందుల దినేశ్‌తోపాటు వజ్జా పార్వతి, దేవా తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ట్యాంకర్.. ట్రాఫిక్‌కు అంతరాయం



రైల్వేగేట్ వద్ద నిలిచిన యాష్ ట్యాంకర్

కారేపల్లి: కారేపల్లి మండలం గాంధీపురం రైల్వేగేట్ వద్ద ఇల్లెందు నుండి ఖమ్మం వైపు వెళ్తున్న యాష్ ట్యాంకర్ లారీ కమాన్ కట్టలు విరిగి నిలిచిపోయింది. దీంతో శనివారం రెండు వైపులా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ మేరకు ఆర్టీసీ బస్సులు మినహా మిగతా వాహనాలను కారేపల్లి క్రాస్ నుండి వయా కారేపల్లి మీదుగా దారి మళ్లించారు. లారీ మరమ్మతు పూర్తయ్యాక పంపించడంతో మళ్లీ రాకపోకలు మొదలయ్యాయి.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

విధుల్లో ఉండగానే కన్నుమూత



వి.లోకేష్ (ఫైల్)



లోకేష్ కుటుంబీకులతో మాట్లాడుతున్న వైరా సీఐ సాగర్

కొణిజర్ల: విధి నిర్వహణలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన కొణిజర్లలో శనివారం తెల్లవారుజామున జరిగింది. ఎస్‌ఐ గుగులోత్ సూరజ్ తెలిపిన వివరాలు... కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో ఈసం లోకేష్(45) హెడ్ కానిస్టేబుల్‌గా నాలుగేళ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం రాత్రి విధులకు వచ్చిన ఆయన శనివారం తెల్లవారుజామున మూత్రవిసర్జన కోసం స్టేషన్ వెనకాల మరుగుదొడ్డి వైపు వెళ్తూ కింద పడ్డాడు. సహచర ఉద్యోగులు గమనించి ఆయనను లోపలికి తీసుకొచ్చి పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. లోకేష్ స్వగ్రామం కొత్తగూడెం కాగా ఖమ్మంలో నివాసముంటున్నాడు. ఆయనకు భార్య, ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా, లోకేష్ మృతదేహం వద్ద వైరా ఏసీపీ ఎం.ఎ.రెహమాన్, సీఐ సాగర్‌నాయక్ నివాళులర్పించి పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియల నిమిత్తం కొత్తగూడెం మృతదేహాన్ని తరలించారు. ఈక్రమంలో స్టేషన్ ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకుడు సూరంపల్లి రామారావు తదితరులు లోకేష్ మృతదేహం వద్ద నివాళుల అర్పించారు.

రేపు ఉమ్మడి జిల్లా జూడో జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి జూడో జట్ల ఎంపిక పోటీలను సోమవారం నిర్వహించనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని జూడో అసోసియేషన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వి.నరేశ్‌కుమార్ తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకల్లా హాజరుకావాలని సూచించారు. వివరాలకు 99512 74678 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సబ్‌స్టేషన్ సమీపంలో పిడుగుపాటు

పగిలిపోయిన లైటింగ్ ఎరస్టర్లు



పిడుగుపాటుకు పగిలిన లైటింగ్ ఎరస్టర్లు

చర్ల: పిడుగుపాటుకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైటింగ్ ఎరస్టర్లు పగిలిపోయిన ఘటన శనివారం చర్ల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని లింగాపురంపాడులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సమీపంలో పిడుగులు పడటంతో సబ్ స్టేషన్‌లో ఉన్న లైటింగ్ ఎరస్టర్లకు సంబంధించి ఇన్సులేటర్లు పగిలిపోయాయి. పిడుగు పడిన సందర్భంలో భారీ శబ్దం రావడంతో ఇన్సులేటర్లు పగిలిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది వాటికి మరమ్మతులు చేశారు.

పూరిల్లు దగ్ధం



పూర్తిగా కాలిపోయిన పూరిల్లు

బూర్గంపాడు: కృష్ణసాగర్ గ్రామపంచాయతీలోని బత్తులనగర్‌లో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు దంపతులు ఉదయం కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో మంటలు వ్యాపించి మొత్తం సామగ్రి కాలి బూడిదైంది. స్థానికులు మంటలను ఆర్పేందుకు యత్నించారు. ఈ ప్రమాదంలో సమస్తం కోల్పోయిన వెంకటేశ్వర్లు దంపతులు ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎస్‌ఈ కార్యాలయం పైనుంచి దూకేస్తాం..

సబ్‌స్టేషన్‌కు స్థలం ఇచ్చిన నరసింహారావు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో పదేళ్ల క్రితం సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆకుల నరసింహారావు 12 కుంటల భూమి ఇచ్చాడు. ఆ సమయాన సబ్‌స్టేషన్‌లో ఉద్యోగం ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ ఇన్నాళ్లు పట్టించుకోకపోగా పలుమార్లు ఆందోళన చేసినా స్పందించడం లేదు. చివరకు శనివారం నరసింహారావు కుటుంబంతో సహా జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయానికి వెళ్లగా అధికారులు కలవలేదు. దీంతో ఆయన మాట్లాడుతూ వచ్చే గురువారం ఖమ్మం ఎస్‌ఈ కార్యాలయం పైనుంచి కుటుంబంతో దూకి ఆత్మహత్య చేసుకుంటానని వెల్లడించాడు. తనకు ఉన్న కొద్దిపాటి మిని సబ్‌స్టేషన్‌కు ఇచ్చి నిరాశ్రయులమయ్యామని, కుమార్తె చికిత్సకు డబ్బు లేక ఇబ్బంది పడుతున్నామని వాపోయాడు.

మాజీ సైనికుడి మృతదేహం వైద్య కళాశాలకు..

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 31వ డివిజన్‌కు చెందిన మాజీ సైనికుడు ఏపూరి శ్రీనివాసరావు(81) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన 2013లోనే భార్యాపిల్లల సమక్షాన తాను కన్నుమూశాక మృతదేహాన్ని మమత మెడికల్ కళాశాలలో విద్యార్థులకు బోధన కోసం అప్పగించాలని వీలునామా రాశారు. ఈ నేపథ్యాన శనివారం ఆయన మృతదేహాన్ని అన్నం సేవా ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావుతో కుటుంబీకులు మమత మెడికల్ కాలేజీకి అప్పగించారు. బీఆర్ఎస్ నాయకుడు గుండాల కృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు ఎర్ర శ్రీకాంత్, ఎర్ర గోపి, ఎర్ర శ్రీనివాసరావు, బండారు యాకయ్య, భూక్యా శ్రీనుతో పాటు శ్రీనివాసరావు సోదరుడు ఏపూరి హరినాథ్ బాబు, ఆర్యవైశ్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దంశెట్టి శ్రీకాంత్, బీజేపీ నాయకుడు కొంకిమళ్ల మృత్యుంజయరావు తదితరులు నివాళులర్పించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కామేపల్లి: మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన గంటా రామకృష్ణ(33) కొద్ది రోజులుగా మద్యానికి బానిసై ఏ పని చేయకపోవడంతో కుటుంబ సభ్యులు మందలించగా శుక్రవారం కలుపు మందు తాగాడు. కాసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆయనకు భార్య శ్రావణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై రామకృష్ణ భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.